క్లుప్తంగా

కన్యక చిత్రం షూటింగ్ పూర్తి

నకరికల్లు: వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రారంభించిన చిత్రం శనివారంతో పూర్తయినట్లు చిత్ర దర్శకుడు రాఘవ తిరువాయిపాటి తెలిపారు. ఆయన మాట్లాడుతూ మహిళలతో అమానుషంగా ప్రవర్తించేవారిని ఎవరు క్షమించినా అమ్మవారు క్షమించరనే అంశంపై కథ సాగుతోందన్నారు. శ్రీకాశీవిశ్వనాథ్ పిక్చర్ బ్యానర్‌పై కన్యక చిత్రాన్ని నకరికల్లులోని వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అక్టోబరు 26న ప్రారంభించి నేటితో చిత్రీకరణ పూర్తిచేశామన్నారు. చిత్రంలో జబర్దస్త్ ఫేమ్ వాసు, మమత, శిరీష, శివరామరాజు, విజయ, ఈశ్వర్, తదితరులు ప్రధాన పాత్రల్లో నటించారన్నారు. చిత్రానికి మాటలు పి.వెంకట్, డి.గోపి రమేష్ కంధ, ఎడిటర్ సుభాన్.బి, సంగీతం అర్జున్, నిర్మాతలు అమరలింగేశ్వరరావు, సాంబశివరావు, పూర్ణచంద్రరావు, రచన, దర్శకత్వం రాఘవ తిరువాయిపాటి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



నకరికల్లు: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఉపాధ్యాయుడు మోహన్‌రావు అన్నారు. గ్లోబల్ యాక్షన్ మంత్ కార్యక్రమంలో భాగంగా 'మన పర్యావరణం - మన బాధ్యత' నిర్వహించారు. మండలంలోని చేజర్లలోని ఉన్నత పాఠశాల విద్యార్థులతో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మన పర్యావరణం - మన బాధ్యత అని భావించాలన్నారు. భవిష్యత్తు తరాలకు మంచి నీరు, మంచిగాలి, మంచి వాతావరణంతోపాటు, మంచి ప్రకృతితోపాటు ఆరోగ్యాన్ని అందించాలంటే పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని కోరారు. ఉపాధ్యాయులు లావణ్య, హేమలత, సత్యవతి, రఘుపీరా, విజయనిర్మల, ఎస్జీఓ భారతి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటు తనిఖీ చేసుకోవచ్చు



మాదల(ముప్పాళ్ళ): ఓటర్లు తమ ఓటును పోలింగ్ కేంద్రాల్లో ఉండే జాబితాల్లో తనిఖీ చేసుకోవచ్చని, ఏమైనా అభ్యంతరాలుంటే దరఖాస్తులు అందించవచ్చని తహసీల్దార్ ఎం.భవానిశంకర్ చెప్పారు. ప్రత్యేక ఓటు ప్రచార దినోత్సవంలో భాగంగా మండలంలోని మాదల, ఇరుకుపాలెం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను శనివారం పరిశీలించారు. 2024 జనవరి 1నాటికి 18 సంవత్సరాలు నిండిన లేదా నిండుతున్నట్లయితే ఓటు హక్కు పొందేందుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఓటు హక్కు కోసం, సవరణలకోసం అందిన అర్జీలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. చనిపోయిన వారి ఓటును తొలగించాలని సూచించారు. మొత్తం 44 పోలింగ్ కేంద్రాల్లోను 44మంది బీఎల్‌ఓలు విధుల్లో పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. ముప్పాళ్ళ, చాగంటివారిపాలెం, కొంకావారిపాలెం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను డీటీ సీహెచ్ లక్ష్మీప్రసాదు పరిశీలించారు.

అనుమానాస్పదంగా వినుకొండ వాసి మృతి



ఏడుకొండలు (ఫైల్)

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలం మారెళ్లవారిపాలెం గ్రామ సమీపంలో వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన వ్యక్తి మృతదేహాన్ని ఐనవోలు పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఐనవోలు ఎస్సై అనీల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం వినుకొండ పట్టణం అంబేద్కర్ నగర్‌కు చెందిన పులి ఏడుకొండలు (25) మారెళ్ల వారిపాలెం, ఈదర ప్రధాన రహదారిపై మృతదేహం తలలేకుండా రోడ్డుపై పడి ఉండటంతో స్థానికులు సమాచారం మేరకు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని వినుకొండ ప్రభుత్వం వైద్యశాలలోని మార్చురికి తరలించారు. తలభాగం ఛిద్రమై ఉండటం, మొండెం వేరు కావటంతో హత్య, ప్రమాదమా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. మృతుడికి భార్య పూజతోపాటు, ఇరువురు సంతానం ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

వినుకొండ టౌన్: అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి యత్నించిన మృతి చెందినట్లు పట్టణ ఎస్ఐ డి.లక్ష్మీప్రసాద్ తెలిపారు. పట్టణ శివారులోని కోటప్ప నగర్‌లో నివాసం ఉంటున్న మక్కెళ్ల రమేష్ (21) అప్పుల బాధ తాళలేక బుధవారం పురుగు మందు తాగాడు. అయితే భర్త వాంతులు చేసుకొంటుండగా భార్య నాగమణి గమనించింది. చికిత్స నిమిత్తం వెంటనే పట్టణంలోని ఓ ప్రైవేట్ వైద్యశాల (బాలాజీ నర్సింగ్ హోం)కు తీసుకురాగా ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తీసుకు వెళ్లమని వైద్యులు సూచించారు. అయితే అక్క డ చికిత్స పొందుతూ రమేష్ శుక్రవారం రాత్రి మరణించాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆరోగ్య సురక్షతో పేదలకు భరోసా



మందుల కిట్ పంపిణీ చేస్తున్న కమిషనర్ షమ్మి, కౌన్సిలర్లు శ్రీనివాసరావు, లక్ష్మి, పట్టణ అధ్యక్షుడు మౌలాలి, తుమ్మల



వైద్య శిబిరానికి హాజరైన ప్రజలు

- సత్తెనపల్లి 19, 20 వార్డుల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం
- 614 మందికి వైద్యపరీక్షలు, ఉచితంగా మందులు

సత్తెనపల్లి: జగనన్న ఆరోగ్య సురక్షతో పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా కల్పించిందని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి అన్నారు. పట్టణంలోని 19, 20 వార్డుల పరిధిలోని ప్రజలకు శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కమిషనర్ కొలిమి షమ్మి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే కాంక్షతో ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. 19వ వార్డు కౌన్సిలర్ అవ్వారు శ్రీనివాసరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశానికి రోల్‌మోడల్‌గా నిలిచారన్నారు. నాడు - నేడు పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చడమే కాకుండా ప్రభుత్వ వైద్యశాలలో మౌలిక వసతుల కల్పనతో పాటుగా పూర్తిస్థాయిలో వైద్యుల నియామకం జరిపారన్నారు. దీర్ఘకాలిక వ్యాధులకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో కార్పొరేట్ వైద్యం అందిస్తున్నారన్నారు. ఆరోగ్యశ్రీ, 108, 104 తదితర పథకాలతో పేదవాడి ఆరోగ్యానికి మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి భరోసా కల్పిస్తే.. ఆయన తనయుడిగా జగనన్న ఆరోగ్యశ్రీ సేవలను మరింత మెరుగుపరిచి పక్క రాష్ట్రాల్లోని కార్పొరేట్ ఆసుపత్రుల్లోనూ ఉచిత వైద్యం అందించే లా చర్యలు తీసుకున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించి జగనన్నకు మద్దతు తెలపాలన్నారు. 20వ వార్డు కౌన్సిలర్ కూకుట్ల లక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంపూర్ణ ఆరోగ్యం కోసం వారి ఇంటి ముంగిటకే వైద్య సేవలను తీసుకొచ్చిందన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టి పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించారన్నారు. ఎంతోమంది ప్రాణాలు కాపాడారన్నారు. ఆయన తనయుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మరో అడుగు ముందుకేసి పేదలకు వారి ఇంటి వద్ద వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. ప్రభుత్వానికి ప్రజల ఆరోగ్యం ముఖ్యం కావడంతో 45 రోజుల పాటు ప్రతి పల్లెలోనూ, ప్రతి వార్డులో వైద్య శిబిరాలు నిర్వహించి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటుందన్నారు. వైఎస్సార్ కంటి వెలుగు ద్వారా కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్ల అద్దాలు సైతం పంపిణీ చేస్తుందన్నారు. ప్రజలు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి మాట్లాడుతూ ప్రజా ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యత కల్పిస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తూ సంక్షేమం, అభివృద్ధిలో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపిన సీఎం జగన్‌మోహన్ రెడ్డిని ప్రజలందరూ ఆశీర్వదించాలన్నారు. జగనన్న పాలనలో ప్రతి కుటుంబానికి మేలు జరిగిందని, గత నాలుగేళ్లుగా రాష్ట్రంలో అమలు చేసిన సంక్షేమ పథకాల కారణంగా రాష్ట్రంలో పేదరిక స్థాయి 11 నుంచి 6 శాతానికి తగ్గిపోయిందన్నారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ ఎం.అనూష, డాక్టర్ జి.ధర్మ సింగ్ శాస్త్రి, డాక్టర్ షేక్ తబస్సుం సుమయ్య, డాక్టర్ సందీపిని, డాక్టర్ పి.సుబ్బారావులు 614 మంది ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. 190 మందికి రక్త శాతం, 215 మందికి రాండమ్ బ్లడ్ షుగర్ పరీక్షలను నిర్వహించారు. ఐదుగురికి మలేరియా, 9 మందికి ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. 11 మందిని మెరుగైన వైద్యం కోసం రిఫర్ చేశారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పోషకాహార ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు తుమ్మల వెంకటేశ్వరరావు, మున్సిపల్ మేనేజర్ ఎస్.సాంబశివరావు, అంగన్వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది, వార్డు వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ సర్వేకు సహకరించండి

సత్తెనపల్లి ఆర్డీఓ బీఎల్ఎన్ రాజకుమారి



చల్లగుండ్లలో బీఎల్ఓలకు సూచనలు చేస్తున్న ఆర్డీఓ రాజకుమారి, పక్కన తహసీల్దార్ నగేష్

సత్తెనపల్లి: ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సత్తెనపల్లి ఆర్డీఓ, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి బీఎల్ఎన్ రాజకుమారి కోరారు. ప్రత్యేక ఓటర్ల నమోదులో భాగంగా శనివారం రాజుపాలెంలోని 140, 141, 147, 149, పోలింగ్ బూత్‌లను, నకరికల్లు మండలం చీమలమర్రిలోని 197,198, 199, చల్లగుండ్లలోని 192, 193, 194 పోలింగ్ బూత్‌లను శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ రాజకుమారి మాట్లాడుతూ బీఎల్‌ఓలు తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలని సూచించారు. డిసెంబర్ 12వరకు కొత్త ఓట్లు నమోదు చేసేందుకు అవకాశం ఉందన్నారు. నిర్దేశిత గడువులో పోలింగ్ కేంద్రాల మార్పిడి, ఓటర్ల జాబితాలో తప్పులు, ఒప్పుల సవరణ, మరణించిన వారి ఓటు తొలగించే ప్రక్రియ సక్రమంగా జరపాలన్నారు. ఆదివారం కూడా బీఎల్‌ఓలు పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా నియోజకవర్గవ్యాప్తంగా శనివారం ఫారం-6లు 74, ఫారం-7లు 26, ఫారం-8లు 126 రాగా ఈ నెల 27న ముసాయిదా జాబితా విడుదలైనప్పటి నుంచి ఈ నెల 3వ తేదీ వరకు ఫారం-6లు 174, ఫారం-7లు 48, ఫారం-8లు 295 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఏఈఆర్వో నగేష్‌కు పలు సూచనలు చేశారు. అలాగే సత్తెనపల్లి మండలం ఫణిదం గ్రామంలోని 85, 86, 87 పోలింగ్ బూత్‌లు, భట్లూరులోని 88, 89, 90 పోలింగ్ బూత్‌లను తహసీల్దార్ ఎస్.సురేష్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బి.ఆదినారాయణ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సురేష్ మాట్లాడుతూ ప్రతి బీఎల్‌ఓ ఓటర్ జాబితాను తీసుకొని ఇంటింటికి వెళ్లి ప్రత్యేక విచారణ చేయాలన్నారు. ఓటు స్థితిగతులను తెలుసుకునేందుకు ప్రభుత్వం హెల్ప్‌లైన్ సర్వీసును ఏర్పాటు చేసిందన్నారు. పంచాయతీ సెక్రటరీలు, వీఆర్వోలు, బీఎల్‌ఓలు ఉన్నారు. అలాగే సత్తెనపల్లి మండలం వావిలాల్ నగర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌ను ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ సుజాత శనివారం సందర్శించారు. కంకణాలపల్లి గ్రామ రెవెన్యూ అధికారి రుద్రపాటి చెన్నమ్మ, బూత్ లెవల్ అధికారి జవ్వాంగుల ఉదయలక్ష్మి, పాఠశాల హెచ్‌ఎం బెల్లంకొండ నాగ సాయి ప్రసాద్ ఉన్నారు.

క్రోసూరు, అనంతవరంలలో..

క్రోసూరు: 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులందరూ ఓటు హక్కు పొందేందుకు దరఖాస్తులు చేసుకుని ప్రత్యేక శిబిరాలలోని బీఎల్‌ఓలకు అందచేయాలని డిప్యూటీ తహసీల్దార్ డి.శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఎన్నికల ప్రత్యేక డ్రైవ్ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ క్రోసూరు, అనంతవరం పోలింగ్‌స్టేషన్లు సందర్శించారు. ఈసందర్భంగా ఆయన పోలింగ్ స్టేషన్ల వద్ద బీఎల్‌ఓలు తీసుకున్న ఫారం 6,7.8 ల పై వచ్చిన దరఖాస్తులు పరిశీలించారు.అనంతరం మాట్లాడుతూ అన్ని పోలింగ్ స్టేషన్ల వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాల గురించి ప్రజలకు తెలియచేయాలని బీఎల్‌ఓలకు సూచించారు. బీఎల్‌ఓలు, క్రోసూరు బీఎల్‌ఓ లేళ్ల బ్రహ్మానాయుడు, ఆయా గ్రామాల ఓటరు దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుడికి పింఛన్ ఆసరా

పుట్టపర్తి వెళ్లి పింఛన్ నగదు అందజేసిన వలంటీర్



చేనేత పింఛన్ పంపిణీకి బయోమెట్రిక్ తీసుకుంటున్న వలంటీర్ బొజ్జ కోటేశ్వరి

సత్తెనపల్లి: పట్టణంలోని 19వ వార్డు సుందరయ్య కాలనీలో నివసిస్తున్న చేనేత కార్మికుడు చిన్నం కృష్ణ అనారోగ్య కారణంగా పుట్టపర్తిలో గుండె ఆపరేషన్ చేయించుకునేందుకు ఇటీవల వెళ్లాడు. విషయం తెలుసుకున్న కొత్తపేట సచివాలయ పరిధిలోని వలంటీర్ బొజ్జ కోటేశ్వరి పుట్టపర్తి వెళ్లి చేనేత కార్మికుడు చిన్నం కృష్ణ చేత వేలిముద్ర వేయించుకొని చేనేత పింఛన్ పంపిణీ చేసింది. దీంతో చేనేత కార్మికుడు చిన్నం కృష్ణ మాట్లాడుతూ తాను వైద్యశాలలో చికిత్స పొందేందుకు వచ్చినప్పటికీ వలంటీర్ వచ్చి తనకు పింఛన్ పంపిణీ చేయడం ఆనందంగా ఉందని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పది కాలాలపాటు రాష్ట్రానికి సీఎంగా ఉండాలన్నారు. ఇలాంటి ప్రభుత్వం మళ్లీ మళ్లీ రావాలని ఆయన ఆకాంక్షించారు. వలంటీర్ బొజ్జ కోటేశ్వరిని 19వ వార్డు కౌన్సిలర్ అవ్వారు శ్రీనివాసరావు, సచివాలయ ఉద్యోగులు శనివారం ప్రత్యేకంగా అభినందించారు.

పాలస్తీనాపై దాడులు నిలిపివేయాలి



నకరికల్లు: పాలస్తీనాపై ఇజ్రాయిల్ తక్షణమే దాడులు నిలిపివేయాలని భారత్ బచావో సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు కోటానాయక్ డిమాండ్ చేశారు. భారత్ బచావ్ రౌండ్‌టేబుల్ సమావేశం శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇజ్రాయిల్ దాడులు పాలస్తీనాపై అత్యంత పాశవికంగా జరుగుతున్నాయన్నారు. చిన్నారులు, మహిళలు, వృద్ధులు తేడా లేకుండా విచక్షణా రహితంగా మృత్యువాత పడుతున్నారన్నారు. ఐక్య రాజ్య సమితిలో దాడులు నిలిపివేయాలని 107 దేశాలు డిమాండ్ చేసినా దాడులు ఆపకపోవడం శోచనీయమన్నారు. సమావేశంలో పీడీఎం రాష్ట్ర నాయకుడు వై.వెంకటేశ్వరరావు, సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్, రైతు సంఘం నాయకులు నరసింహారెడ్డి, కుంచారావు, పౌర హక్కుల సంఘం నాయకులు వి.పేరయ్య, గిరిజన సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు బి.శ్రీనునాయక్, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు పంపిణీ



క్రోసూరు: ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కుమారుడు వైఎస్సార్ సీపీ నాయకులు నంబూరు కల్యాణ చక్రవర్తి జన్మదినం సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు శనివారం స్థానిక ఎస్సీకాలనీలోని ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో పార్టీ మండల నాయకులు తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, చిల్కా రవికుమార్, విశ్రాంత హెచ్‌ఎం జంగం కోటేశ్వరరావు, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల్లో సాయిసుష్మకు ద్వితీయ స్థానం

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో స్కూల్ గేమ్స్ అండర్-17 విభాగంలో వాలీబాల్ పోటీల్లో రాష్ట్ర స్థాయి పోటీలో ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థి తుర్లపాటి సాయిసుష్మ (8వ తరగతి) సాధించటం అభినందనీయమని తహసీల్దారు షేక్ జాన్‌సైదులు అన్నారు. శనివారం స్కూల్ గేమ్స్ విభాగాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు.

గణిత శాస్త్రవేత్త శకుంతల దేవికి నివాళులు



శకుంతల దేవి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

పెదకూరపాడు: ప్రపంచ ప్రసిద్ధ గణిత, ఖగోళ, జ్యోతిష్య శాస్త్రవేత్త శకుంతలాదేవి జయంతి సందర్భంగా శనివారం మండల పరిధిలోని పెదకూరపాడు జడ్పీ హైస్కూల్లో నివాళులర్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు శకుంతల దేవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా హెచ్‌ఎం కె.వి.రమణ మాట్లాడుతూ గణిత శాస్త్రంలో అద్భుతాలు చేసి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ లో స్థానం సంపాదించి విద్యార్థులందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కేవీ రమణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి: పట్టణంలోని సుగాలీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం హ్యూమన్ కంప్యూటర్‌గా పిలవబడే భారతీయ ప్రముఖ గణిత శాస్త్రవేత్త శకుంతల దేవి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గణిత ఉపాధ్యాయుడు పెద్దింటి వెంకట కోటేశ్వరరావు మాట్లాడుతూ జీవితంలో ప్రతి అంశం గణితంతో ముడిపడి ఉందన్నారు. అతి సాధారణ కుటుంబంలో జన్మించిన శకుంతల దేవి, కంప్యూటర్ కంటే వేగంగా గణిత సమస్యలు సాధించి ప్రపంచ ప్రఖ్యాతి గాంచారని కొనియాడారు. గణిత ఉపాధ్యాయులు పెద్దింటి చిన్న నాగేశ్వరరావు, గొల్లపల్లి శ్రీనివాసరావు, ఇన్‌చార్జి హెచ్‌ఎం అబ్దుల్ రజాక్‌లు మాట్లాడారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం రామ్‌నాథ్, హుస్సేన్, ఐఎస్ నాగిరెడ్డి, జగన్‌మోహన్ సింగ్, నరేష్, జి.కోటేశ్వరరావు, షేక్ షకీరా, డాక్టర్ నారాయణం వెంకట రాంబాబు, మేడ వెంకటేశ్వర్లు, గణిత క్లబ్ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలు సందర్శించిన విద్యార్థులు



రెవెన్యూ శాఖ గురించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ డి.శ్రీనివాసరావు

బాలెమర్రు(క్రోసూరు): మండలంలోని బాలెమర్రు ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులు నో బ్యాగ్‌డే పురస్కరించుకుని క్రోసూరులోని పలు ప్రభుత్వ కార్యాలయాల విధులు గురించి తెలుసుకునేందుకు పాఠశాల హెచ్‌ఎం టి.శరత్ ఆధ్వర్యంలో శనివారం సందర్శించారు. ఈసందర్భంగా క్రోసూరులోని తహసీల్దార్ కార్యాలయం, పోస్టాఫీసు, యూనియన్ బ్యాంక్, పోలీసుస్టేషన్‌లను సందర్శించి ఆయా కార్యాలయాలలో జరిగే విధులు, వాటి ద్వారా ప్రజలకు అందే సేవల అంశాలను తెలుసుకున్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద డిప్యూటీ తహసీల్దార్ డి.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం అందించే అన్ని సదుపాయాలను సద్వినియోగపరుచుకుని బాగా చదువుకుని ఉన్నతస్థానాలకు వెళ్లాలని అన్నారు. రెవెన్యూ కార్యాలయంలో అధికారులు ఎటువంటి విధులు నిర్వహిస్తారో తెలియచేశారు. అనంతరం యూనియన్ బ్యాంకు మేనేజరు విద్యార్థులకు బ్యాంకు ద్వారా అందే సేవలను వివరించగా, సబ్ పోస్ట్‌మాస్టర్ పోస్టాఫీసులో ఉత్తరాలు బుక్‌చేయటం, రవాణా చేయటం, డిపాజిట్లు సేకరణ గురించి తెలిపారు. స్థానిక ఇన్‌చార్జి ఎస్‌ఐ సత్యనారాయణ పోలీసుస్టేషన్ విధులు తెలిపారు. పాఠశాల హెచ్‌ఎం తూమాటి శరత్, ఉపాధ్యాయుడు రంజిత్ పాల్గొన్నారు.

సైన్స్ నాటిక ప్రదర్శనలు అభినందనీయం



విజేతలకు బహుమతులు అందిస్తున్న డిప్యూటీ డీఈఓ వేణుగోపాలరావు

నరసరావుపేట ఈస్ట్: సామాన్యులను శాస్త్రీయ దృక్పథం వైపు మరలించేలా సైన్స్ నాటిక ప్రదర్శనలు నిర్వహించటం అభినందనీయమని డిప్యూటీ డీఈఓ కె.వేణుగోపాలరావు తెలిపారు. పల్నాడు రోడ్డులోని పల్నాడు కళాక్షేత్రంలో శనివారం జిల్లా సైన్స్ అధికారి ఏఏ మధుకుమార్ పర్యవేక్షణలో జిల్లాస్థాయి సైన్స్ నాటిక పోటీలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి ఎనిమిది బృందాలు పోటీలో పాల్గొన్నాయి. విజేతలకు బహుమతులు అందించిన వేణుగోపాలరావు మాట్లాడు తూ, రాష్ట్రస్థాయి, దక్షిణ భారతదేశ స్థాయిల్లో ప్రతి భ కనపరిచి జాతీయస్థాయిలో బహుమతులు సాధించాలని ఆకాంక్షించారు. పాఠశాల స్థాయి నుంచే శాస్త్రీయతపై అవగాహన పెంచుకుని దేశం గర్వించదగ్గ పౌరులుగా ఎదగాలని కోరారు. పోటీలో జెడ్పీ హైస్కూల్ వేల్పూరు ప్రథమ, కె.జి.బి.వి. సంతగుడిపాడు ద్వితీయ, జెడ్పీ హైస్కూల్ పాలపాడు తృతీయ బహుమతులు సాధించాయి. కార్యక్రమంలో ఎంఈఓ నాగేశ్వర రావు, అకడమిక్ కో ఆర్డినేటర్ సీతారామయ్య, కళాక్షేత్రం అధ్యక్షుడు పొన్నపాటి ఈశ్వరరెడ్డి, శ్రీనాథ కళాపరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి, రంగస్థలి అధ్యక్షుడు పి.బాజి తదితరులు పాల్గొన్నారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా షేక్.మహ్మద్ గౌస్, షేక్.మహ్మద్ గౌస్, షేక్.పాషా, జి.శ్రీనివాసరావు వ్యవహరించారు.

సత్తాచాటిన వేల్పూరు విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న డిప్యూటీ డీఈఓ వేణుగోపాల్

శావల్యాపురం: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి సైన్సు డ్రామా పోటీలు పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణంలోని పల్నాడు కళాక్షేత్రంలో శనివారం నిర్వహించినట్లు వేల్పూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ మహబుబ్ సుభాని శనివారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాస్తు-వాస్తవం అను అంశంపై నాటికను ప్రదర్శించారు. వాస్తు వాస్తవం కాదని భౌగోళిక పరిసరాల ప్రకారం ఉన్న వనరుల ఆధారంగా ఇంటి నిర్మాణలు ఉండాలన్నారు. ఉత్తమ ప్రదర్శనగా గుర్తించి జిల్లా స్థాయి లో ప్రథమ స్థానం సాధించారు. త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి సైన్సు డ్రామా పల్నాడు జిల్లా తరపున పాల్గొంటారన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు జ్యోతి శ్రీనివాసరావు గైడ్ ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. సైన్సు ప్రదర్శన డ్రామా పోటీల్లో 9,10 తరగతులు విద్యార్థులు ఏడుగురు పాల్గొనగా వివేక్, పార్థు, జస్మిత్, సాయి కృష్ణ, సాయి చైతన్య, సాద్విక్, సంజయ్, షఫీలు విజేతలుగా ఎంపికయ్యారు. జిల్లా సైన్సు అధికారి ఏఏ మధుకుమార్, డిప్యూటీ డీఈఓ కె.వేణుగోపాల్, ఎంఈఓ నాగేశ్వరరావులు కార్యక్రమంలో పాల్గొని విజేతలను అభినందించి బహుమతులు అందజేశారు. పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ పల్లపాటి శ్రీనివాసరావు, వివేకానంద పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు సంద్రపాటి చలపతిరావు, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

అవ్వకు చేకూరిన 'రక్షణ'

- హైవే పక్కన బిక్కుబిక్కుమంటూ వృద్ధురాలు
- అటుగా వచ్చి.. చూసి స్పందించిన పోలీసులు
- గుంటూరు నిర్మల్ హృదయ్‌కి తరలింపు



నిర్మల్ హృదయ్ ఆశ్రమంలో చేర్పిస్తున్న హైవే పెట్రోలింగ్ పోలీసులు హనుమంతరావు, గోపీ

యడ్లపాడు: **"దారిపక్క చెట్టుకింద ఆరిన కుంపటి విధాన కుర్చున్నది ముసల్దోకతె మూలుగుతూ ముసురుతున్న ఈగలతో వేగలేక..."** అంటూ మహాప్రస్థానంలో శ్రీశ్రీ రాసిన భిక్షు వర్షీయసి కవితకు ప్రతీకలా యడ్లపాడు గ్రామంలోని హైవే రహదారి వెంట శనివారం సాక్షాత్కరించిదో 75 ఏళ్ల వృద్ధురాలు. అసలే ఎక్స్‌ప్రెస్ హైవే.. వందకు పైగా వేగంగా ప్రయాణించే వాహనాలు.. అందులోనూ ఆకాశం కరిమబ్బు దాల్చి.. చలిగాలులు వీస్తున్నాయి. ఏ క్షణమైనా వర్షం కురిసేలా ఉంది. బిక్కు బిక్కుమంటూ దిక్కుల్ని పరికిస్తూ దీనంగా కూర్చున్న ఆ వృద్ధురాలిని అటుగా వెళ్తున్న హైవే పెట్రోలింగ్ పోలీసులు గమనించారు. సరిగ్గా నడవలేని ఆ వృద్ధురాలు హఠాత్తుగా హైవే రహదారి పక్క ఎలా ప్రత్యక్షమైందో అర్థం కాలేదు. ఆ దీనురాలి అవస్థను చూసి చలించారు. వాహనాన్ని ఆపి వివరాలు అడిగారు. మలివయసు మతిమరుపు వెరసి ఫలితం లేకపోయింది. దీంతో ఆమెను తమ వాహనంలో యడ్లపాడు పోలీస్‌స్టేషన్‌కు తెచ్చారు. హైవే పెట్రోల్ సిబ్బంది హనుమంతరావు, గోపీను ఎస్ఐ అభినందించారు. వెంటనే ఆమె సంరక్షణ కోసం గుంటూరులోని నిర్మల్ ఆశ్రమానికి తరలించి, తమ మానవత్వాన్ని చాటుకున్నారు. ఆ తల్లి వివరాలు తెలిసిన వారు యడ్లపాడు పోలీస్‌స్టేషన్ లేదా నిర్మల్ హృదయ్ ఆశ్రమానికి వచ్చి మలిదశలో ఉన్న ఆమెకు ఆదరణ పంచాలని ఎస్ఐ సురేష్ కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కేబీఆర్ కళాశాల విద్యార్థులు

నరసరావుపేట ఈస్ట్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు కాసు బ్రహ్మానందరెడ్డి జూనియర్ కళాశాలకు చెందిన ఇరువురు విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్.వి.నాగిరెడ్డి శనివారం తెలిపారు. తమ విద్యార్థులు ఎం.జాన్‌రెడ్డి అండర్-17 క్రికెట్ పోటీకి, షేక్.రోహన్ జాన్మర్ అథ్లెటిక్ (డిస్కస్ త్రో) విభాగానికి ఎంపికైనట్టు వివరించారు. త్వరలో పట్టణంలోని డీఎస్ఏ స్టేడియంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలలో తమ విద్యార్థులు ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

పంటలు పరిశీలించిన వ్యవసాయాధికారులు

రొంపిచర్ల: పంటకు మోతాదుకు మించి రసాయనిక మందులను వాడడం వల్ల పంటలు దెబ్బ తింటాయని వ్యవసాయ శాఖ బృందం తెలియజేసింది. మండలంలోని నల్లగార్లపాడు, మాచవరం గ్రామాల్లో రైతులు సాగుచేస్తున్న మినుము, మొక్కజొన్న, వరి, కంది తదితర పంటలను పరిశీలించింది. మాచవరంలోని ఒక రైతు తన మొక్కజొన్న పైరు యర్రగా మారి ఎండిపోతున్నదని నరసరావుపేట ఏడీఏకి ఫిర్యాదు చేయటంతో శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు, మొక్కజొన్న పైరును పరిశీలించారు. ప్రస్తుత తరుణంలో ఆ పైరుకు 100 మిల్లీ లీటర్ల పిచికారీ చేయాల్సిన రసాయనిక మందును 250 ఎంఎల్ పిచికారీ చేయడం వల్ల పైరు దెబ్బతిందని వారు తెలిపారు. తిరిగి పైరు యథాస్థితికి వచ్చేందుకు రైతు తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు, పిచికారీ చేయాల్సిన మందులను తెలియజేశారు. అలాగే మినుము పంటను పరిశీలించారు. బెట్ట పరిస్థితుల వలనే మినుము పంటకు ముడత ఆశించిందన్నారు. అలాగే ఈ గ్రామాల్లో రైతు సాగు చేస్తున్న వరి పైరును పరిశీలించారు. గ్రామాల్లో ఉన్న వర్మీకం పోస్ట్ ఎరువుల తయారీ కేంద్రాన్ని సందర్శించారు.